

జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న చింతల సురేందర్‌యాదవ్

నాగోల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

మన్సూరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు అభివృద్ధికి నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆయా ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్ కోరారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చింతల సురేందర్‌యాదవ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రోడ్లు, పార్కులు అభివృద్ధికి నోచుకోవడం లేదని, కనీసం వీధి దీపాలు వెలగని పరిస్థితి నెలకొందని, వెంటనే నిధులు మంజూరు చేసి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని జెడ్సీని ఆయన కోరారు. కార్యక్రమంలో రాక్‌టౌన్ కాలనీ అధ్యక్షుడు వినోద్, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్

చంపాపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని ఆయా కాలనీలు, బస్తీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ సాయినగర్‌కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.43లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, కాలనీ ప్రతినిధులు ప్రకాష్‌గుప్తా, రాజేందర్, నర్సింహారెడ్డి, సురేష్‌రెడ్డి, శ్రీధర్‌గుప్తా, నాయకులు పాల్గొన్నారు.



దాతునగర్‌కాలనీలో పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం డివిజన్‌లో..

చంపాపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని ఆర్‌కేఆర్ ఎన్‌క్లేవ్, ధాతునగర్‌కాలనీ, నందనవనంలో బుధవారం కార్పొరేటర్ సుజాతానాయక్ పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కాలనీల ప్రతినిధుల కోరిక మేరకు సీసీ రహదారులు, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కాలనీలను అన్నివిధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు కార్పొరేటర్ అన్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌కేఆర్ ఎన్‌క్లేవ్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

పేదలకు మంచి వైద్యం అందించాలి : అరుణారెడ్డి



బస్తీ దవాఖానాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి

సైదాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు మంచి వైద్యం అం దించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి సూచించారు. బుధవారం డివిజన్ పరిధిలోని క్రాంతినగర్ బస్తీ దవాఖానాను పరిశీలించారు. రోగులకు అందుతున్న చికిత్స సౌకర్యాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లలేని పేదలు బస్తీ దవాఖానాలకు వస్తారని వారికి మెరుగైన చికిత్స అందించాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో బస్తీవాసులు పాండురంగం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్, కాలనీ ప్రతినిధులు

ముగ్గులు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలు

కొత్తపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ముగ్గులు తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలని కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. న్యూ మారుతీనగర్ మహిళా ప్రతినిధులు పెసరు రమారెడ్డి, తాళ్లపల్లి సుజాత, పద్మ, సంతోషిల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి పవన్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కాలనీ ప్రతినిధులతో కలిసి ఆయన రంగవల్లులను పరిశీలించారు. అనంతరం కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పోటీల్లో మొదటి బహుమతి సాధించిన సంగీత, రెండో బహుమతి పొందిన లావణ్యలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న మిగతా 38మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, రవి, ప్రభాకర్, శ్రీనివాస్, శంకర్‌రెడ్డి, కనకయ్య పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, సభ్యులు

హయత్‌నగర్ : మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని వినాయకనగర్ కాలనీలో సంక్షేమ సంఘం 2025 క్యాలెండర్‌ను బుధవారం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కళ్లెం శంకర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు కొండల్‌రెడ్డి, పురుషోత్తం, కోశాధికారి అచ్చుత్‌రెడ్డి, నాయకులు గుండ్లపల్లి రమేష్ గౌడ్, సత్యయ్యగౌడ్, విష్ణుమూర్తి, భరత్‌రెడ్డి, కేవీరెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

- ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్

సంతోష్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధలను పాటించి ప్రమాదాల బారి నుంచి కాపాడుకోవాలని ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా బుధవారం ఐఎస్‌సదన్ క్రాస్‌రోడ్డులో సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియమాలను తెలియజేస్తూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ గురించి ప్రతి ఒక్కరూ తప్పని సరిగా తెలుసుకోవాలన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుండగా ప్రతి మూడు నిమిషాలకు అదే రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఎక్కువ శాతం అధిక వేగంతో రోడ్డుపై వాహనాలను నడపడం, మద్యం సేవించి నడపడం, హెల్మెట్లు పెట్టుకోకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరుగుతుందని వాపోయ్యారు. రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతీ ఒక్క వ్యక్తి ట్రాఫిక్ రూల్స్‌ని పాటించి ఇతరులకు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. కార్యక్రమంలో సౌత్-ఈస్ట్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్, సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్‌గౌస్, సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహనాయక్, ఐఎస్‌సదన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

సైదాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్ సూచించారు. బుధవారం ట్రాఫిక్ భద్రతా మాసోత్సవాల సందర్భంగా సైదాబాద్‌లోని మాతృశ్రీ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వప్రసాద్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలు తగ్గుతాయని వివరించారు. మానవ తప్పిదాలతోనే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, గుంతలమయంగా ఉన్న రహదారులపై ప్రయాణం చేయడం, వాహనాల బ్రేకులు ఫేయిల్ కావడం, వాహనాలను న్యూటల్ చేసి నడపడం వల్లనే ప్రమాదాలు సంభవిస్తున్నట్లు వివరించారు. ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిగ్నల్స్ వద్ద రూల్స్ పాటించాలని, ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు పొందాలని, హెల్మెట్ లేకుండా ప్రయాణించవద్దని, ట్రిబుల్ రైడింగ్ చేయవద్దని ఆయన విద్యార్థులను కోరారు. వాహనాల తనిఖీలో విద్యార్థులు పట్టుబడుతున్నారని, కేసులతో తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో చంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్, సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహనాయక్, సుమారు 300మంది విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న నాగోల్ ఇన్‌చార్జి ఆర్టీఓ అమర్‌నాథ్



రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై ప్లకార్డులతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ అధికారులు

రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి : అమర్‌నాథ్

మన్సూరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచే విద్యార్థులు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని, ఆ దిశగా ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ డ్రైవింగ్ పరీక్ష విధాన ప్రాంగణ ఇన్‌చార్జి ఆర్టీఓ అమర్‌నాథ్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం నాగోల్‌లోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ డ్రైవింగ్ పరీక్ష విధాన ప్రాంగణం ఆధ్వర్యంలో చంపాపేట్ డివిజన్ మారుతినగర్‌లోని సైనిక్ స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా 'ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం- రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ ప్రమాదం జరిగాక వచ్చే నష్టం జీవితాంతం తీవ్రంగా కలవరపెడుతోందని, ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ నియమాలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు అనితారెడ్డి, శ్రీధర్, విష్ణుదీపక్‌రెడ్డి, మినిస్ట్రియల్ స్టాఫ్, సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, నాగోల్ ఆర్టీఏ సిబ్బంది పాల్గొన్నారు.

వేలగొంతులు, లక్షడప్పుల కార్యక్రమం విజయవంతం చేద్దాం

- మాదిగ జేఏసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ప్రతాప్

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 7న నిర్వహించనున్న వేలగొంతులు, లక్షడప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ రంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షుడు బోసుపల్లి ప్రతాప్ పిలుపునిచ్చారు. బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని గండిచెరువు, సుర్మాయిగూడ లష్కర్‌గూడ, అబ్దుల్లాపూర్ గ్రామాల్లో మాదిగ జేఏసీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు కంబాలపల్లి భాస్కర్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటికో డప్పు, ఊరుకో లారీ, లక్షలాది మంది డప్పు దరువులతో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు యాదయ్య, సుధాకర్, శ్రీకాంత్, స్టాలిన్, రవి, యాదగిరి, యాదయ్య, నర్సింహ, రవీందర్, మహేష్, మైసయ్య, స్వామి, రాములు, అండాలు, యాదమ్మ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.



చేతులెత్తి అభివాదం చేస్తున్న మాదిగ జేఏసీ నాయకులు

కారు డ్రైవర్ అదృశ్యం



వెంకటేశ్

హయత్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కారు డ్రైవర్ అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ రంగనాయకులగుట్ట కాలనీలో నివాసం ఉండే మొర్రబోయిన వెంకటేశ్(38) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. డిసెంబర్ 29న హైటెక్ సిటిలోని ఓ కంపెనీలో కారు డ్రైవర్‌గా పనిచేయడానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అదే రోజు రాత్రి 9గంటలకు భార్య లావణ్యకు ఫోన్‌చేసి నైట్ డ్యూటీ ఉంది ఇంటికి రాలేకపోతున్నానని చెప్పాడు. 30న లావణ్య భర్త వెంకటేశ్‌కు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. భర్త తిరిగి ఇంటికి రాకపోవడం లావణ్య తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం ఉదయం లావణ్య హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకుతో గొడవ పడి తల్లి..



లావణ్య

హయత్‌నగర్ : కుమారుడితో గొడవ పడిన తల్లి అదృశ్యం అయిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగనూర్‌కు చెందిన దోమలపల్లి లావణ్య(40) తుర్కయంజాల్ మున్సిపాలిటీలో స్వీపర్‌గా పని చేస్తుంది. ఈనెల 6న డబ్బుల విషయంలో తల్లి, కొడుకుల మధ్య గొడవ జరిగింది. మరుసటి రోజు ఉదయం పనికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో మధ్యాహ్నం ఆమె కుమారుడు ఫోన్ చేయగా ఆస్పత్రికి వెళ్లినట్లు చెప్పింది. అనుమానం వచ్చిన ఆమె కుమారుడు చరణ్ మున్సిపాలిటీలో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా బుధవారం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

- ఎన్‌ఐపీఈఆర్ డీన్ నండూరి శ్రీనివాస్



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉన్నదని ఎన్‌ఐపీఈఆర్ డీన్ డాక్టర్ నండూరి శ్రీనివాస్ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఫార్మసీ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్‌డే కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్, కళాశాల చైర్మన్ అవంతి శ్రీనివాస్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఫార్మా రంగంలో మెరుగైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని సూచించారు. కళాశాల చైర్మన్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలతో పోలిస్తే ఫార్మా తయారీలో భారత్ దూసుకుపోతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అతిథులు జీవన్ సైంటిఫిక్ టెక్నాలజీ లిమిటెడ్ హెడ్ శరత్‌చంద్ర, సైంటిస్ట్ సునీల్‌కుమార్, రామ్‌జీ పల్లెల తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

- లక్ష్మీగణపతి ఆలయ ప్రతినిధులు

వనస్థలిపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 10న వైకుంఠ ఏకాదశికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తల్తెతకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు లక్ష్మీగణపతి ఆలయ కమిటీ చైర్మన్ బుద్దోలు అశోక్‌కుమార్‌గౌడ్ తెలిపారు. బుధవారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి అంగరంగ వైభవంగా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రభాకర్, కంచి కృష్ణమోహన్, మిట్టా రామ్మోహన్, లక్ష్మారావు, బాలేశ్వర్, సురేష్, బ్రహ్మాచారి, రజిని, సులోచన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీగణపతి ఆలయ ప్రతినిధులు



జిల్లా ఆర్యవైశ్య మహాసభకు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న చంపాపేటకు చెందిన మిత్రమండలి సభ్యులు

జిల్లా ఆర్యవైశ్య మహాసభకు ఎన్నికైన సభ్యులకు సన్మానం

చంపాపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభకు వివిధ హోదాలలో నూతనంగా ఎన్నికైన సభ్యులను బుధవారం చంపాపేటలో మిత్రమండలి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. చంపాపేట డివిజన్‌కు చెందిన జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి బిల్లకంటి కిరణ్‌కుమార్‌గుప్తా, ఉపాధ్యక్షులు రాములుగుప్తా, ఊరే మధుసూదన్‌గుప్తా, జిల్లా వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు బచ్చు మహేష్‌గుప్తా, విద్యా కమిటీ జిల్లా చైర్మన్ నాగబండి నాగేష్‌గుప్తా, యూత్ సహాయ కార్యదర్శి చీకటిమల్ల లోకేష్‌గుప్తా, ఆయా కమిటీల సభ్యులు కొండూరు శ్రీకాంత్ గుప్తా, గోవింద్ శ్రీనివాస్‌గుప్తాకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు హస్తినాపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీలా మధుసూదన్‌గుప్తా, కర్నాటి రమేష్‌గుప్తా, వేణుగోపాల్‌రావు, శ్రీనివాసులు, యాదయ్య, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతు పనుల కారణంగా గురువారం 11కేవీ నెహ్రూనగర్, జవహర్‌పురా, ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రెయిన్‌బజార్, వాహేద్‌కాలనీ, జహంగీర్‌నగర్ ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు, పూలతోట ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, యాస్రాప్‌నగర్, సోమనాథ్‌టెంపుల్ ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12నుంచి 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో..

సంతోష్‌నగర్ : టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11 కేవీ సౌత్‌ఎండ్‌పార్క్, ఆల్‌ఇండియా రేడియో, మదర్‌డైరీ, లెక్చరర్స్‌కాలనీ, రాఘవేంద్రకాలనీ, కల్వంచ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో నిర్వహణ పనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ తెలిపారు. 11కేవీ సౌత్‌ఎండ్‌పార్క్, ఆల్‌ఇండియా రేడియో ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, 11కేవీ మదర్‌డైరీ, లెక్చరర్స్‌కాలనీ, రాఘవేంద్రకాలనీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, 11కేవీ కల్వంచ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30గంటల నుంచి మధ్యాహ్నం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

అల్వాల్ : గంజాయిని పాకెట్ల రూపంలో రవాణా చేసేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు నిందితులను అల్వాల్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరికి చెందిన భాస్కర్‌రెడ్డి (26), ఫిరోజ్ (27)లు కొంతకాలంగా నాగపూర్ నుంచి గంజాయిని దిగుమతి చేసుకొని స్థానిక యువకులకు విక్రయిస్తున్నారు. ఈ మేరకు 430 గ్రాముల గంజాయి పాకెట్లను బొల్లారం రైల్వేస్టేషన్ నుంచి రవాణా చేసేందుకు ప్రయత్నించగా అల్వాల్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్నారు. నిందితులు 10 గ్రాముల పాకెట్‌ను రూ. 300 కొనుగోలు చేసి రూ. 500లకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడయ్యింది. ఈ మేరకు అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలను పక్కదారి పట్టించేందుకే దాడులు

- బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడులు సిగ్గుచేటు
- రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి

మన్సూరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను పక్కదారి పట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని, ఇందులో భాగంగానే బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై ఆ పార్టీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై మంగళవారం కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ ఎల్బీనగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న బీజేపీ పెద్దలు, నాయకులపై మాటలతోనే కాకుండా చేతలతోనూ దాడులు చేయడం సిగ్గుచేటని, ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు పన్నినా ఎప్పటికప్పుడు నిలదీస్తూనే ఉంటామన్నారు. అధికారంలో ఉన్నామని ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోమని, బీజేపీ కార్యకర్తలు బయటకు వస్తే కాంగ్రెస్ నాయకులు బయటకు తిరిగే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. ఇప్పటికైనా దాడులు చేసే సంస్కృతిని మానుకుని ప్రజా సంక్షేమంపై, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టిపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సామ రంగారెడ్డి సూచించారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, కొత్త రవీందర్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, నీళ్ల అంజన్‌కుమార్‌గౌడ్, నాంపల్లి రామేశ్వర్, కలంశెట్టి లయ, నూతి శ్రీనివాస్, కృష్ణంరాజు, పాతూరి శ్రీధర్‌గౌడ్, యంజాల జగన్, యాదగిరియాదవ్ పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో బీజేవైఎం నేతల ఆందోళన

సరూర్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యాలయంపై మంగళవారం కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడికి నిరసనగా బుధవారం బీజేవైఎం నేతలు మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి కూడలిలో బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేవైఎం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రాఘవేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనతో మీర్‌పేట్ రోడ్డుపై కాసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. అనంతరం సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేయడానికి యత్నించగా మీర్‌పేట్ పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు యువమోర్చా కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. దాంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అనంతరం పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ పార్టీ కార్యాలయాలపై దాడులు చేయడం మానుకుని, ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని హితవు పలికారు.

హింసను ప్రేరేపిస్తున్న రేవంత్ సర్కార్ : అందెల

సరూర్‌నగర్ : తమ పార్టీ తలచుకుంటే ఒక్క కాంగ్రెస్ కార్యాలయం కూడా మిగలదని, కానీ హింసకు ప్రతి హింస తమ సిద్ధాంతం కాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. రేవంత్ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలో హింసను ప్రేరేపిస్తున్నదని, ఇది మంచి పద్ధతి కాదని ఆయన పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడి నేపథ్యంలో బుధవారం నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అందెల మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలకు సహనం ఎక్కువ అని, అందుకే మంగళవారం నాటి ఘటనకు ప్రతి దాడులు చేయడం లేదని అన్నారు. తాము ఒక్క పిలుపు ఇస్తే బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యాలయాలను నామరూపాలు లేకుండా చేయగలుగుతారని ఆయన వ్యాఖ్యానించారు. అధికారం ఉంది కదా అని ఇష్టమొచ్చినట్టు రెచ్చిపోతే బీజేపీ శ్రేణులు చూస్తూ ఊరుకోబోరని శ్రీరాములుయాదవ్ స్పష్టం చేశారు. క్రమశిక్షణ కలిగిన తమ పార్టీని రెచ్చగొడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, మరోమారు ఇలాంటి సంఘటనలు జరిగితే సహించే ప్రసక్తేలేదని అందెల హెచ్చరించారు.



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సామ రంగారెడ్డి, చిత్రంలో కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, పవన్‌కుమార్ తదితరులు